క్లుప్తంగా

'నేను బడికి పోతా'పై అవగాహన



చావలి(వేమూరు): బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రభుత్వం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల విద్యా శాఖాధికారి రోజ్ ల్యాండ్ అన్నారు. మండలంలోని చావలి గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల(ఆర్)లో ఇద్దరు విద్యార్థులను చేర్పించినట్లు తెలిపారు. వారు కొడిపర్రు, పెరవలి గ్రామాల పిల్లలుగా వెల్లడించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులతో మానవ హారం ఏర్పాటు చేసిన అవగాహన కల్పించారు. ఎంఈఓ శేషగిరి, హెచ్ఎం మరియదాసు, సీఆర్పీ కట్టా వీరయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్



వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై శుక్రవారం సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషగిరి తెలిపారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులు, పెన్షన్లు, ఉపాధి కూలీల నగదుపై ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సోషల్ ఆడిట్ సిబ్బందికి ఫీల్డ్ అసిస్టెంట్లు పూర్తిగా సహకారించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ప్రతి ఏటా సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సోషల్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీలో ఉద్యోగులకు ఉచిత దంత పరీక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం వారాహి దంత వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ స్కానర్ ద్వారా 150 మంది ప్రభుత్వ ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించారు. తమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ సదుపాయం ద్వారా దంత వైద్యం చేస్తామని డాక్టర్ చదలవాడ యోగశ్రీ , డాక్టర్ మౌనిక తెలిపారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

పెదకాకాని: పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై నేతాజీ కోరారు. పెదకాకాని పుచ్చలపల్లి సుందరయ్యకాలనీలో గురువారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. పెదకాకాని పి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. సమావేశంలో నేతాజీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న వారికి పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం ఈవోపీఆర్డీ షేక్ సుభానికి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు చింతల శ్రీనివాసరావు, మండల సీపీఎం కార్యదర్శి ఎస్ శివాజీ, ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు దీవి నరసింహారావు, శేషగిరిరావు, ఎస్ లక్ష్మి, బుజ్జి, వి పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

ఈశా యోగా చాలెంజ్‌లో పేర్ల నమోదుకు ఆహ్వానం

నగరంపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా 21 రోజుల యోగా చాలెంజ్‌కు పేర్లు నమోదు చేసుకోవాలని ఆ ఫౌండేషన్ గుంటూరు సమన్వయకర్త ఎన్.యు.సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేరు నమోదు చేసుకుని, బహుమతులు పొందేలా సరికొత్త చాలెంజ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 30 వరకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. సద్గురు యాప్‌లో పేర్లు నమోదు చేసుకుని, 21 రోజుల్లో మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరచుకునేందుకు ఇది చక్కని వేదికని ఆయన పేర్కొన్నారు. ఇందులో సరళమైన, శక్తివంతమైన యోగాభ్యాసాలు రోజు వారి జీవితంలో సులభంగా ఆచరించేందుకు వీలుగా ఉంటాయని వివరించారు. వివరాల కోసం ఈశా వలంటీర్ జగదీష్ (9848861432)ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఈ నగరానికి ఏమైంది ?

- ట్రాఫిక్ సమస్య తీవ్రం
- ప్రొటోకాల్‌కే ప్రాధాన్యం
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిబ్బంది కరువు
- పట్టించుకోని పోలీసు అధికారులు



ఓవర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న వృద్ధుడు



రాధాకృష్ణ థియేటర్ సెంటర్‌లో పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్

పట్నంబజారు: నగరంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. ఎక్కడిక్కడ వాహనాలు నిలిచి పోతున్నా కనీసం ట్రాఫిక్ పోలీసులు కనపడని దుస్థితి ఏర్పడింది. ఎక్కడ చూసినా బారులు తీరిన వాహనాలతో రోడ్లన్నీ దర్శనం ఇస్తున్నాయి. ఆఖరికి ప్రజలే ట్రాఫిక్ పోలీసుల అవతారం ఎత్తి చక్కదిద్దాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగరంలో ఓ ట్రాఫిక్ డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఈస్ట్, వెస్ట్ స్టేషన్ల పరిధిలో వంద మంది వరకు ఏఎస్ఐ కేడర్ మొదలుకొని హోంగార్డులు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐలు లేకుండానే ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా నడిచింది. గత పది రోజులుగా నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రుల ప్రమాణ స్వీకారాలు, ఇతరత్ర ప్రొటోకాల్ అంశాల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు బందోబస్తులకు తరలి వెళ్లారు. స్టేషన్ పరిధిలో కనీసం పట్టుమని నలుగురైదుగురు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు కూడా పట్టణంలో పరిస్థితి పట్టించుకోకుండా పూర్తి స్థాయిలో సిబ్బందిని బందోబస్తుకు తరలించడంతో ఈ దుస్థితి ఏర్పడింది. పట్టణంలో ట్రాఫిక్ నానాటికి పెరిగిపోతున్నా కనీస చర్యలు చేపట్టలేని అధికారులు కేవలం ప్రొటోకాల్ విధులకే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ ప్రజల నుంచి విమర్శలు తలెత్తుతున్నాయి.

- గుంటూరు ఈస్ట్ పరిధిలోని 60 అడుగుల రోడ్డు, ఆసుపత్రులు అధికంగా ఉన్న ఓల్డ్ క్లబ్ రోడ్డులో ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ భారీగా నిలిచిపోతోంది. కనీసం హోంగార్డు కూడా విధుల్లో లేకపోవడం గమనార్హం.
- రాధాకృష్ణ థియేటర్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఆ కొద్ది దూరం ప్రయాణించడానికి 40 నిమిషాలు పడుతోంది.
- గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి ముందు నుంచి ఓవర్ బ్రిడ్జి పైవరకు ప్రయాణమంటేనే నరక ప్రాయంగా మారింది.

నో సిగ్నల్స్

నగరంలో సుమారు 15 వరకు సిగ్నల్ పాయింట్లు ఉన్నాయి. అయితే ఒక్కటీ పనిచేయకపోవడంతో పరిస్థితి ఘోరంగా మారింది. సిబ్బంది లేకపోవడం, సిగ్నల్స్ సైతం మొరాయించడంతో ట్రాఫిక్ తీవ్రత ప్రజల్ని మరింత ఒత్తిడికి గురిచేస్తోంది. ఆర్కేటీ సెంటర్, హిందూ కళాశాల కూడలి, హిమని కూల్‌డ్రింక్ సెంటర్, కళామందిర్ సెంటర్, బృందావన్ గార్డెన్స్ ప్రాంతాలతోపాటు మిగతా ప్రాంతాల్లో సైతం సిగ్నల్స్ మూగబోయాయి. దీనిపై అధికారులు కనీస చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

ప్రజలే ట్రాఫిక్ పోలీసుల అవతారం

నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమైన నేపథ్యంలో ప్రజలే ట్రాఫిక్‌ను క్లియర్ చేసే బాధ్యతను భుజానికి ఎత్తుకున్న సందర్భాలు తారసపడ్డాయి. హిమని కూల్‌డ్రింక్ సెంటర్‌లో ఒక కండక్టర్ బస్సు దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేసుకుంటూ ముందుకు తీసుకెళ్లిన పరిస్థితి కనబడింది. ఓవర్‌బ్రిడ్జి సెయింట్ జోసఫ్ పాయింట్ వద్ద సుమారు 70 ఏళ్ల వయస్సున్న వృద్ధుడు ట్రాఫిక్ తీవ్రతరం కావడంతో ద్విచక్ర వాహనం పక్కన పెట్టి క్లియర్ చేసిన పరిస్థితులున్నాయి. నగరంలో కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతున్నా సిబ్బందిని బందోబస్తు, ప్రొటోకాల్‌కు కేటాయించడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది



ఉపాధ్యాయురాలు ప్రమీలారాణిని సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

భట్టిప్రోలు: ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని, భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో వారు ప్రధాన పాత్ర వహిస్తారని ప్రధానోపాధ్యాయుడు ఎస్కే మహబూబ్ బాషా అన్నారు. మండలంలోని పెసర్లంక దేవభక్తుని కోటయ్య జెడ్పీ హైస్కూల్‌లో బయాలజీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన తాళ్లూరి ప్రమీలారాణి, ఆమె భర్త పొట్లూరి రవీంద్రబాబును గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఉద్యోగ విరమణ తప్పనిసరన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయి వరకు మూడున్నర దశాబ్దాల పాటుగా ఉపాధ్యాయ జీవితం గడిపిన ప్రమీలారాణి శేష జీవితం సుఖమయంగా సాగాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు లక్ష్మి యోగానందాచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిని ప్రియాయాదవ్‌కు డాక్టరేట్

- వర్షాభావాన్ని తట్టుకునే సజ్జ వంగడం అభివృద్ధి
- డాక్టరేట్ ప్రదానం చేసిన ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ



నాదెండ్ల: వర్షాభావ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడులు అందించే సజ్జ విత్తనం వంగడం అభివృద్ధికి సాగించిన పరిశోధనకు నందిని ప్రియా యాదవ్ డాక్టరేట్ సాధించింది. బాపట్లలోని వ్యవసాయ యూనివర్సిటీలో నందిని ఏజీ బీఎస్సీ పూర్తి చేసింది. ఇటీవల ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో హైదరాబాద్‌లోని ఐసీఏఆర్–ఐసీఎంఆర్ సంస్థల్లో పరిశోధనలు చేశారు. ఆమెకు గైడ్‌గా ప్రిన్సిపల్ సైంటిస్ట్ పి సంజనా రెడ్డి వ్యవహరించారు. ప్రియానందిని తండ్రి బీఆర్‌వీకే స్వామి కేంద్రీయ విద్యాలయం (ఇర్లపాడు) ప్రిన్సిపల్‌గా పనిచేశారు. తల్లి పద్మ కుమారి కేంద్రీయ విద్యాలయంలో అధ్యాపకురాలు. నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న ప్రియానందిని మాట్లాడుతూ, తన వివాహానంతరం రాయలసీమలో స్థిరపడ్డానని, ఈ ప్రాంతంలో వర్షాభావం కారణంగా పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించానన్నారు. సజ్జ సాగులో వర్షాభావం ఎదుర్కొని అధిక దిగుబడులు ఇచ్చే వంగడం ఉత్పత్తికి రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో సజ్జ విత్తనాలను సేకరించి పరిశోధనలు సాగించినట్లు తెలిపారు. ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులను తట్టుకుని మంచి దిగుబడులిచ్చే వంగడాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తన కృషిని గుర్తించి ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు వివరించారు. తనకు వెన్నుదన్నుగా తన భర్త ట్రైనీ తహసీల్దార్ మకర క్రాంతి కుమార్ నిలిచారన్నారు. డాక్టరేట్ సాధించిన నందిని ప్రియాయాదవ్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి

- చికిత్సకు రూ.16 కోట్లు అవసరం
- దాతల నుంచి సాయాన్ని అభ్యర్థించిన తల్లిదండ్రులు



చిన్నారి హితైషితో తల్లిదండ్రులు ప్రీతం, గాయత్రి

నగరంపాలెం: దాతలు సాయం చేసి తమ కుమార్తె ప్రాణాలు కాపాడాలంటూ తల్లిదండ్రులు అభ్యర్థించారు. నగరంలోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో చిన్నారి తల్లిదండ్రులైన వి.ప్రీతమ్, గాయత్రి వివరాలు వెల్లడించారు. రాజమండ్రి కోటగుమ్మానికి చెందిన వి.ప్రీతంతో గుంటూరు నల్లచెరువు మూడో వీధికి చెందిన తూనుగుంట్ల గాయత్రితో వివాహమైంది. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. తొమ్మిది నెలలు కిందట గాయత్రి నగరంపాలెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆడ శిశువుకి జన్మనిచ్చింది. ఆమెకు హితైషిగా నామకరణం చేశారు. ఆరు నెలల వయసులో నేల మీద పాకకపోవడం, మెడ నిలబడక పోవడం, కూర్చోకపోవడంతో అదే ప్రైవేటు ఆసుపత్రిలో చూయించారు. నెల ఫిజియోథెరపీ చేయించాలని, మందులు రాసిచ్చారు, అయినప్పటికీ, పాప అలాగే ఉండటంతో మళ్లీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు సూచన మేరకు విజయవాడలోని మరో ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేయించగా, నివేదిక ఆధారంగా బెంగళూరు వైద్యులు అరుదైన వ్యాధి స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ)గా గుర్తించారని తల్లిదండ్రులు తెలిపారు. ఎనిమిది నెలల వయసులో వ్యాధిని గుర్తించారని, టైప్–1తో పోరాడుతోందని పేర్కొన్నారు. ఇది అరుదైన, ప్రాణాంతకమైన వ్యాధిగా వైద్యులు చెప్పారని తెలిపారు. దీని చికిత్సకు అందించే ఇంజక్షన్ విలువ రూ.16 కోట్లు అని, అది కూడా రెండు నెలల వ్యవధిలో జరగాల్సి ఉందని తెలిపారని పేర్కొన్నారు. గతంలో లక్ష మందిలో ఒకరికి, ప్రస్తుతం 10 వేల మందిలో ఒకరికి వస్తోందని వైద్యులు చెప్పారని వివరించారు. చికిత్స కోసం దాతల నుంచి ఆర్థిక సాయాన్ని అభ్యర్థించారు. నగదును ఆర్‌బీఎల్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 2223330038835175కు పంపించాలని కోరారు. సమావేశంలో పాప తాత తూనుగుంట్ల నాగేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

శరణార్థులను మానవత్వంతో ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది అవధానుల హరి

లక్ష్మీపురం: యుద్ధాలు, తీవ్ర సంక్షోభాలు, హింసాత్మక ఘటనలు, ప్రకృతి వైపరీత్యాలతో స్వస్థలాలు వదిలి ప్రాణ రక్షణకు వలస వస్తున్న శరణార్థుల్ని కేంద్ర ప్రభుత్వం మానవత్వంతో ఆదుకోవాలని అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు, న్యాయవాది అవధానుల హరి కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిమిషానికీ ప్రపంచవ్యాప్తంగా 20 మంది శరణార్థులుగా నివాసాలు వదిలి ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుని ఇతర ప్రాంతాలు, దేశాలకు వలస వెళుతున్నారని తెలిపారు. నేడు భీకరంగా జరుగుతున్న రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయిల్ పాలస్తీనా యుద్ధాల వల్ల నేటికి దాదాపు 10 మిలియన్ల శరణార్థులు పొరుగు ప్రాంతాలకు వలస వెళుతున్నారని పేర్కొన్నారు.

శరణార్థులపై కేంద్ర ప్రభుత్వం మానవత్వంతో వహించాలని కోరారు. కార్యక్రమంలో విద్యావేత్త ఎస్.రవిబాబు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సీనియర్ సభ్యులు ప్రసంగించారు.

రైలు ప్రయాణికుల భద్రత గాలిలో దీపం

రైల్వే ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా కొట్టుమిట్టాడుతోందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ప్రమాదం విపక్షాలు డిమాండ్ చేస్తున్నట్లుగా రైల్వే వ్యవస్థ సమూల ప్రక్షాళన అవసరాన్ని గుర్తు చేస్తోందని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునీకరణతో పాటు రైల్వే ప్రయాణికుల భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుల గురించి రంగుల కలలు చూపిస్తున్న పాలకులు తాజా ఘటనతోనైనా క్షేత్రస్థాయి వాస్తవాలపై కళ్లు తెరవాలని డిమాండ్ చేశారు.

అరుంధతీ రాయ్‌పై 'ఉపా' ప్రయోగం సిగ్గుచేటు

అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులున్న రచయిత్రి అరుంధతీరాయ్ మీద పద్నాలుగు ఏళ్ల నాటి ఓ కేసును తిరగదోడి ఆమె మీద ఏకంగా ఉపా ప్రయోగానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా అనుమతించడాన్ని ప్రతి ఒక్కరూ నిరసించాలని కొండా శివరామిరెడ్డి కోరారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



బాపట్లటౌన్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు తెలిపారు. గురువారం పట్టణంలోని పాత బస్టాండ్ సెంటరులో వాహన చోదకులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదాలకు బాధ్యులుగా వాహన యజమాని శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి, అతివేగంతో వాహనాలు నడిపినా, రాంగ్ రూట్‌లో ప్రయాణించినా అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



నగరంపాలెం: లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామికి గురువారం నిజరూప దర్శన అలంకారం చేశారు. ఉదయం 7 గంటలకు నిత్య హోమం, బలిహరణ, 108 కలశాలతో అష్టోర కలశ స్నపన, అభిషేకాలు అత్యంత వైభవంగా చేశారు. రాత్రి గజ వాహనంపై గ్రామోత్సవం, ఎదుర్కోల ఉత్సవాలు జరిగాయి. అనంతరం జరిగిన స్వామి కల్యాణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీ జగన్నాథ, శ్రీ ఆంజనేయ, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు ఆర్.టి.ఆర్.వి. ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

చేబ్రోలు :ద్విచక్ర వాహనానికి గేదె అడ్డురావటంతో జరిగిన ప్రమాదంలో వృద్ధుడికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో గురువారం జరిగింది. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామానికి చెందిన డి వెంకట సుబ్బారావు ద్విచక్ర వాహనంపై వస్తుండగా అకస్మాత్తుగా గేదె అడ్డువచ్చింది. దీంతో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో వెంకట సుబ్బారావు కాలు విరగటంతో పాటు ఇతర భాగాల్లోనూ గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వ్యాపారి నుంచి రూ.4 వేలు కాజేసిన దుండగుడు

మంగళగిరి: పట్టణ పరిధిలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం రోడ్డు పక్కన మామిడికాయలు విక్రయించే వ్యాపారిని గుర్తుతెలియని వ్యక్తి వచ్చి క్షణాల్లో మోసగించాడు. అతడు తొలుత ఫోన్ పేకి డబ్బులు పంపిస్తానని, నగదుగా తనకివ్వాలని అడిగాడు. నగదు తీసుకున్నాక, ఫోన్ పేలో వేరే వారికి పంపిన రసీదు చూపి వెంటనే వెళ్లిపోయాడు. తన ఖాతాకు నగదు రాకపోవడంతో మోసపోయానని తెలుసుకొని బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఆటో పత్రాలు తనిఖీచేస్తున్న ఎంవీఐ అంకమ్మరావు

కొల్లూరు: ప్రయాణికులతో పాటు సరుకులు, వ్యవసాయోత్పత్తులు తరలించడంలో కీలకంగా ఉన్న ఆటో వాలాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని బాపట్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు పేర్కొన్నారు. గురువారం ఆయన కొల్లూరు, వేమూరు మండలాల పరిధిలో ప్రత్యేకంగా ఆటోల తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని ఆటోని సీజ్ చేసి, పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు లాభాపేక్షతో నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోలో పరిమితికి మించి, డ్రైవర్ పక్కన ప్రయాణికులను ఎక్కించుకోకూడదని స్పష్టం చేశారు. రవాణా సమయంలో ఆటోకు సంబంధించిన అన్ని పత్రాలు ఉంచుకోవాలని చెప్పారు.

రెవెన్యూ సేవలపై అవగాహన



తహసీల్దారు మునిలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్వోలు

భట్టిప్రోలు: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏటా జూన్ 20న రెవెన్యూ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఐ.మునిలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, దైనందిన కార్యక్రమాలను రైతులు, ప్రజలకు వివరించారు. అదేవిధంగా మీ–సేవ ద్వారా సర్టిఫికెట్ల జారీ తదితర సమాచారంతో నీటి తీరువా రేట్ల పట్టిక ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారును వీఆర్వోలు ఘనంగా సన్మానించింది. మండలంలోని 12 సచివాలయాల్లో రెవెన్యూ డే వేడుకలు నిర్వహించారు.

మాదిగల జన జాతర సభను విజయవంతం చేయాలి

మాదగ దండోర రాష్ట్ర నాయకులు

పెరవలిపాలెం(వేమూరు): మాదిగ దండోర ఉద్యమం స్థాపించి 30 సంవత్సరాలు అయిందని మాదగ దండోర రాష్ట్ర నాయకులు ఏటూకూరి విజయ్ మాదిగ, కోటేశ్వరరావు మాదిగ తెలిపారు. మండలంలోని పెరవలిపాలెంలో గురువారం మాదిగ సామాజిక వర్గం ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై 7న ఈదుమూడి గ్రామంలో మాదిగ దండోర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని గ్రామాల నుంచి మాదిగలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమానికి మందా కృష్ణ మాదిగ రావడం జరుగుతుందని తెలిపారు. మాదిగల జన జాతర సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాల్లమాటి దాసు, గ్రామ యువత పాల్గొన్నారు.

తారకనాథ్ సేవలు చిరస్మరణీయం



పేద విద్యార్థులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ ప్రతినిధులు

కొరిటెపాడు: ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీ తారకనాథ్ వర్ధంతిని గురువారం నగరంపాలెంలోని స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గుంటూరు మాడ్యూల్ పరిధిలోని అన్ని బ్రాంచీల్లో సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాపరిషత్ ప్రాంగణంలోని రామకృష్ణ శారదా విద్యాలయంలో పేద విద్యార్థులకు స్కూల్ యూనిఫాం అందించారు. కాజ గ్రామంలోని ఎస్‌కేసీవీ చిల్డ్రన్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని ఆమోదిని బాలికల హోంకు నిత్యావసర సరుకులు అందించారు. పొన్నూరు మండలంలోని బ్రాహ్మణకోడూరులో ఉన్న ఆర్ఫాన్ కేర్‌లో పేద బాలబాలికలకు నిత్యావసర సరుకులు అందజేశారు. సుమారు 130 మంది తాత్కాలిక సిబ్బందికి గృహోపకరణాల్ని సొసైటీ, యూనియన్ నాయకులు బహూకరించారు. గుంటూరు మెయిన్ బ్రాంచి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో గుంటూరు అర్బన్ రీజినల్ మేనేజర్ ఫణి కొండలరావు, మెయిన్ బ్రాంచి ఏజీఎం రామ్‌ప్రసాద్, ఇతర బ్రాంచి అధికారులతోపాటు మాడ్యూల్ డీజీఎస్ ఎన్.శ్రీనివాసాచార్యులు, ఏజీఎస్ కోటిరెడ్డి, నరేంద్ర, నాయకులు తారకనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఇబ్రహీం, మేగ్యానాయక్, సంపత్, రాజశేఖర్, ఖలీల్, కాశీవిశ్వనాథ్, సునీత, కోఆపరేటీవ్ సొసైటీ ప్రెసిడెంట్ కృష్ణమోహన్, సెక్రటరీ రంగసాయి, స్టేట్ బ్యాంక్ లోకల్ బ్రాంచీల్లో పనిచేస్తున్న సిబ్బంది పాల్గొన్నారు.